# కథ

## మేడ్ ఫర్ ఈచదర్...

**సోమంచి రామం**

మా మావయ్యది వృషభరాశి. అత్తయ్యది వృశ్చికరాశి. ఒకరు వృషభం. ఇంకొకరు వృశ్చికం. అందుకనే కాబోలు, నలభై అయిదేళ్ళపైబడి కాపురం చేస్తున్నా, తెల్లారి లేచిన దగ్గర్నుంచీ, యిద్దరికీ ఒక్కక్షణం పడేదికాదు.

తెల్లారడం తరవాయి, యిక మొదలవుతుంది.

"టూత్‌పేస్టు ట్యూబు అడుగునుంచి నొక్కాలని, పేస్టు వేసుకున్నాక, క్యాప్ టైట్‌గా పెట్టాలని, ఎన్నిసార్లు చెప్పాను? నా మాట వినిపించుకోవా?" అంటూ బాత్‌రూంలోంచే అరుస్తున్నాడు మావయ్య!

"ఏమిటీ? ఇందాకట్నించీ చూస్తున్నాను. తెల్లారిందో లేదో..ఎంతసేపూ నా తప్పులెంచడమేనా మీ పని? పేస్టు రావడం ముఖ్యంగానీ, ఎక్కడి నుంచి నొక్కితేనేం? అయినా నా ట్యూబు, నా పేస్టు, నా నోరు, నా ముఖమూ - నా యిష్టం. ఎలా కడుక్కుంటే మీకెందుకు? ఇక్కడ కూడా మీ పెత్తనమేనా? చూస్తున్నాగా! ప్రతిదానికీ ఏదో వంకపెట్టి ధుమధుమలాడ్డం అలవాటైపోయింది!" అంటూ మాటకి మాటా ఝాడించేసింది అత్తయ్య!

అసలు, అత్తయ్య హైస్కూల్లో చదివేటప్పుడే ఆ రోజుల్లోనే మగాళ్ళమీద-

'సాగనీయం - సాగనీయం - ఇకపై పురుషాధిక్యం,
ఆగనీయం - ఆగనీయం - ఇంతుల స్వాతంత్ర్య రథం
మారనీయం - మారనీయం - స్త్రీపురుష సమానత్వం-' అంటూ కవిత్వం రాసింది.

మావయ్యకప్పుడది గుర్తొచ్చింది. అంతే. మళ్లీ కిక్కురుమంటే ఒట్టు.

"ఇదిగో..కా..ఫీ!" అంటూ సాగదీస్తూ, వంటింట్లో కిటికీలోంచే, అందించింది అత్తయ్య - కిటికీ బైట షేవింగు చేసుకుంటున్న మావయ్యకు.

"అదిగో..అదే వద్దన్నాను. షేవింగు చేసుకున్నాక, ఆ లుంగీపంచెతో ముఖం తుడుచుకోవద్దని, ఎన్నిసార్లు చెప్పినా మానరుగా" అంటూ బైటికొచ్చింది.

"ఎలాగూ స్నానం చేసేటప్పుడు తడిపేసేదేగా!" అన్నాడు మావయ్య, తేలిగ్గా!

"తడిపితే మాత్రం, వెంట్రుకలున్న ఆ సబ్బునురగ, పంచెకంటుకుంటే, చూడ్డానికి అసహ్యంగా వుంటుంది" అంటూ రుసరుసలాడింది.

* * *

అయ్యా! ఇలా తెల్లారగానే ప్రారంభమయ్యే వాగ్యుద్ధం, రాత్రి పడుకోబోయేదాకా, ఏదో ఒక విషయం మీద సాగుతూనే ఉంటుంది.

అయినా, నలభై అయిదేళ్ళ నుంచీ, మాటా మాటా అనుకుంటూనే సంసారాన్ని నెట్టుకొచ్చేశారు. పిల్లలు పెద్దవాళ్ళై, పెళ్ళిళ్ళై ఎవరిదోవన వాళ్ళు కాపరాలకెళ్ళిపోయారు.

ఇదిగో యిక యిప్పుడు ఒంటికాయ సొంటికొమ్ములా, యిద్దరే మిగలడంతో పని తక్కువ, తీరిక ఎక్కువ కావడంతో, తీరుబడిగా కూర్చుని, గిల్లికజ్జాలాడుకోసాగారు.

ఇదంతా యిప్పుడెందుకు చెప్పాల్సొచ్చిందంటే, నిన్న రాత్రి, ఆ వృద్ధదంపతుల మధ్య మాటా మాటా పెరిగి, యూ హౌమచ్..అంటే యూ హౌమచ్ అనే దాకా వెళ్ళింది.

"ఏమిటి మీవరస? ఇందాకట్నించి చూస్తున్నాను. అరవై యేళ్ళు నెత్తిమీదికొచ్చినా స్వతంత్రించి, ఓ వంద రూపాయలు ఖర్చు చేసుకొనేపాటి స్వతంత్రం కూడా నాకు లేదా? ఎన్నాళ్ళింకా యిలా అణిగిమణిగి పడి ఉండాలి?" అంటూ గయ్‌మంది అత్తయ్య!

"అది కాదు కావుడూ! ఖర్చు చేసుకోవద్దన్నానా? అయితే, దేనికెంత ఖర్చు చేశావో చెప్పమంటున్నానంతే - ఖర్చుచేసిన ప్రతి దమ్మిడీకీ, పక్కాగా లెక్కరాసే అలవాటు, మా తాతగారు నాకు నేర్పారు. అందుకని..."

"అదేం కాదు! నాకు తెలుసు. మీ మనసులో ఏముందో! నేనక్కడికేదో మా వాళ్ళకు దోచిపెట్టేస్తున్నానని మీ అనుమానం. ఏం లాభం? ఇన్నేళ్ళనుంచీ, యింటి పని, వంట పని, పాచి పని, చాకలి పని..యిలా అన్ని పనులూ చేస్తూ, ఆదా చేస్తున్నా, పిసరంతన్నా, గౌరవముందా నామీద? అంతేలెండి. నేనున్నంతకాలం, నా విలువ తెలిసిరాదు మీకు" అంటూ ముక్కు చీదేసింది అత్తయ్య.

"అది కాదు కావుడూ!" అంటూ ఏదో చెప్పబోయాడు మావయ్య!

"మీరేం చెప్పక్కర్లేదు. మీకంత కష్టంగా వుంటే చెప్పండి. రేపే మా పుట్టింటికెళ్ళిపోతాను" అంటూ దుప్పటి ముసుగెట్టేసింది.

ఆ మర్నాడుదయం అందరికీ మామూలుగానే తెల్లారింది. కానీ మావయ్యకి మాత్రం-

"కావుడూ.. కాఫీ..!" అంటూ బద్ధకంగానే లేచిన మావయ్యకు, యిల్లంతా బోసిగా కనబడింది. రెండుసార్లు కేకేశాడు. సమాధానం లేదు. గబగబ లేచి, యిల్లంతా చూశాడు. అత్తయ్య కనబడలేదు. కంగారు పుట్టింది. గుండె దడదడ లాడింది. బయటికెళ్ళే డోరు, ఆటోమేటిక్..కొంపతీసి, అన్నంత పనీ చేసి పుట్టింటికెళ్ళిందా ఏమిటి? టేబుల్ మీద ఉండే బ్రీఫ్‌కేసు లేదు. అందులో కాగితాలన్నీ పడేసి ఉన్నాయి. అర్థమైంది. పంతం చెల్లించుకుందన్నమాట అనుకున్నాడు మావయ్య.

నీరసంగా సోఫాలో కూలబడిపోయాడు. ఓ పావుగంటయాక, ఇక తప్పదన్నట్లు లేచి, బ్రష్ చేసుకుని, కాఫీ కలుపుకుని తాగాడు. ఓ గంటసేపు పేపరు చదువుతూ కూర్చున్నాడు. సాయంత్రానికి రాకపోతుందా! ఈ ఒక్క పూటకి, హోటలుకెళ్ళి డబ్బు తగలెయ్యడమెందుకు? ఎలాగో కాస్త ఉడకేసుకుని తింటే పోలా! అనుకున్నాడు.

పెళ్ళికాకముందు కొన్నాళ్ళు స్వయంపాకం వెలగబెట్టాడు మావయ్య! ఆ ధీమాతో వంట ప్రయత్నం ప్రారంభించాడు. గిన్నెలో బియ్యంపోసి కడిగి, కాసిని నీళ్ళుపోసి, స్టౌమీద పెట్టాడు. పొట్లకాయముక్కలు తరిగి, ఉప్పురాసి, పిండి, బూర్లెమూకుడులో నూనెలో పడేశాడు. రెండో బర్నరు మీద బూర్లెమూకుడు పెట్టి, బర్నరు వెలిగించాడు.

'కావుడొచ్చేస్తే బాగుండును...' అనుకుంటూ ఆశతో ఓసారి వీధిగుమ్మం దగ్గరకెళ్ళాడు. కాస్సేపు చూసి నిరాశగా లోపలికొచ్చాడు. ఈలోగా కూర మాడువాసనొచ్చింది. గబగబ బర్నర్లు ఆఫ్ చేసి దాని మొహాన్నింత కారం జల్లాడు. హమ్మయ్య అనుకుంటూ, హాల్లోకొచ్చి మళ్లీ పేపరు చదవసాగాడు. కానీ బుర్ర పన్జేయడం లేదు.


విసుగ్గా పేపరక్కడ పడేసి, వీధిగుమ్మం దగ్గరకెళ్ళి చూడ్డం మొదలెట్టాడు, అత్తయ్య వస్తుందేమోనన్న ఆశతో!

అలా ఎదురుచూపుల్తోనే మధ్యాహ్నం పన్నెండు గంటల దాకా గడిపాడు. ఇక ఆత్మారాముడు అల్లరి మొదలెట్టాడు. తెల్లారి, అయిదు గంటలే అయినా అత్తయ్య లేకపోయేసరికి, అయిదురోజులైనట్లుగా బాధపడిపోతున్నాడు. అసలు వాళ్ళమ్మా, నాన్న పోయాక, కావుడు, పుట్టింటి కెళ్ళడమే మానేసింది. అలాంటిది

ప్పుడు పంతానికి వెళ్ళిందంటే- తనే తొందరపడ్డాడేమోనని బాధపడసాగాడు మావయ్య.

ఇక ఆకలికి ఆగలేక, డైనింగు టేబుల్ మీదకు అన్నీ తెచ్చిపెట్టుకున్నాడు. కంచంలో పచ్చడి, కూర వేసుకున్నాడు. అన్నం గిన్నెమూత తీసి, గరిటెతో అన్నం పెట్టుకోబోతే అన్నం జావలా కారిపో యింది.

అత్తయ్య మల్లెపువ్వుల్లాంటి అన్నం వండి, కంచంలో పెద్దే ఆవకాయ కలుపు కుని, లొట్టలేసుకుంటూ మరీ తినేవాడు. మరిప్పుడో అన్నం జావ! కూర ఉప్పుక షాయం! ఒక్కసారిగా, కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరిగాయి. ఏడుపొచ్చేసింది.





ఇంతలో కాలింగ్ బెల్ మోగింది. ఏడుపుముఖంతో, కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళి తలుపు తీశాడు. ఎదురుగా అత్తయ్య! ఆనందం, దుఃఖం రెండూ కలగలుపైపోగా కళ్ళు తుడుచుకున్నాడు.

"కావుడూ! ఇంకెప్పుడూ ఖర్చు వివరాలడగనే!" అంటూ బావురుమన్నంత పనీచేశాడు.

అత్తయ్య మాత్రం, మావయ్యను తప్పించుకుంటూ సీరియస్‌గా లోపలికొస్తూనే, డైనింగ్ టేబుల్‌పై హంగామా చూసింది. అంతే! దుఃఖం పొంగుకొచ్చేసింది.

"పాపిష్టిదాన్ని..మిమ్మల్ని అన వసరంగా కష్టపెట్టాను" అంటూ గబగబా స్నానం చేసి, వంట మొద లుపెట్టింది. ఆవిడ వెనకాలే, కూడా కూడా తిరుగుతూ, "అదేంటి కావుడూ! పుట్టింటికెళ్ళినట్టే వెళ్ళి, వెంటనే తిరిగొచ్చేశావ్! అక్కడే మన్నా..." అర్థోక్తితో ఆగిపోయాడు.

"ఆ! ఎందుకులెండి. కడుపుచించుకుంటే, కాళ్ళమీద పడుతుంది" అంది కళ్ళుతుడుచుకుంటూ!

"ఓహో! అలాగా! అయినా నీ పిచ్చిగాని కావుడూ! నీ తోడబుట్టినవాడు కాబట్టి, నీ తమ్ముడికి నీమీద అభి మానం ఉండచ్చు. కానీ ఆ అమ్మాయికి నీమీద గౌరవం ఉండాల్సిన అవసరమేముంది?"

"అది కాదండీ! ఏదో ఆవేశంలో అలా అనేసి, వెనకా ముందూ ఆలోచించకుండా, అక్కడికి వెళ్ళానా తీరావెళ్ళే సరికి 'ఆయన ఊళ్ళోలేరు. క్యాంపుకె ళ్ళారు. రెండ్రోజులదాకా రారు' అంటూ ఎదురొచ్చింది. అక్కడికీ ఉండ బట్టలేక 'అంటే లోపలికి రావద్దని అర్థమా?' అన్నాను. 'ఏమో ఆ అర్థాలు, తాత్పర్యాలు నాకు తెలీవు. ఆయనబ ట్టేగా నువ్వు. ఆయన ఊళ్ళో లేనప్పుడు నీకిక్కడేం పని?' అంటూ నా మొహం మీదే తలుపేసేసి లోపలికెళ్ళిపో యింది" అంటూ అత్తయ్య కంటతడిపె ట్టింది.

"ఊర్కో కావుడూ! ఊర్కో! అంతా నీలాగే ఉంటారా? ఆ అమ్మాయి మన స్తత్వం పద్ధతి అలాంటిది. అయినా అసలు తప్పంతా నాది. నేను నీ మనసు బాధపెట్టబట్టి కదా, ఇవాళ నీకిలా జరి గింది. అదంతా నా తప్పేనే" అంటూ చేతులుపుచ్చుకున్నాడు మావయ్య.

"ఛా..ఊర్కోండి!" అంటూ మావ య్యను డైనింగు టేబుల్ వద్దకు తీసుకె ళ్ళింది.

ఇద్దరూ తేలికైన మనసులతో హాయిగా భోంచేశారు.

తలనొప్పిగా ఉందని, అత్తయ్య ఆ రాత్రి పెందరాడే పడుకుంది. అర్ధరాత్రి మావయ్యకు బి.పి. ఎక్కువైంది. అత్త య్యను లేపడం యిష్టంలేక తనే మందు బిళ్ళకోసం లేవబోయారు. కాలికి గ్లాసు తగిలి శబ్దమైంది. అత్త య్యకు మెళకువ వచ్చింది. గబగబ లేచి మావయ్యను కూర్చోబెట్టి, టాబ్లెటు వేసి మంచినీళ్ళిచ్చింది.

"తలనొప్పి ఎక్కువగా ఉందా కావుడూ?" అంటూ అత్తయ్య కణతల మీద ఆయింట్‌మెంటు పూశాడు.

మావయ్య ఛాతీమీద, అత్తయ్య నెమ్మదిగా నిమరసా గింది. క్షణంలో యిద్దరూ నిద్రలోకి జారుకున్నారు.

రుచులు, అభిరుచుల్లో తేడాలున్నా, మనస్తత్వాలు వేరైనా, మధ్య మధ్యలో మనస్పర్థలు వచ్చినా, స్త్రీ పురుషు లిద్దర్నీ కడదాక కట్టిపడేసేదే ఈ వివాహబంధం. అందుకే మన భారతీయ సంస్కృతిలో ఈ దాంపత్యజీవి తానికి, అత్యంత విశిష్టమైన పరమ పవిత్రమైన స్థాన ముంది.

వైవాహిక జీవిత ప్రథమాంకంలో, యవ్వనపు పొంగుల్తో చేరువయేటప్పుడుండే తహతహ తమకం, తీరు వేరు. చరమాంకంలో చేరువయ్యే చేరికలో ఉండే, అనురాగం, ఆపేక్ష, ఆప్యాయతల దారి వేరు.

అవి ఉదయాస్తమయాల సంకేతాలు!

ఆ దిశగా పరికిస్తే- మా అత్తయ్య, మావయ్యలు ధన్య జీవులు.